క్లుప్తంగా

వరసిద్ధి వినాయకుడికి విశేష పూజలు


హోమం చేస్తున్న దృశ్యం

రావికమతం: టి.అర్జాపురంలోని బాల వరసిద్ధి వినాయకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆదివారం సంకష్టహర చతుర్థి సందర్భంగా పలువురి దంపతులతో అర్చకుడు లక్ష్మణరావు దూర్వాయుగ్మార్చన ప్రత్యేక పుష్పార్చన, విశేష సుగంధ ద్రవ్యాలుతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 41 మంది ఎంపిక


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ శివారు గిరిజన గ్రామం సమ్మెదలో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిస్ట్ పి.దివ్య, క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్‌కుమార్ 70 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 41 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయులు సూరెడ్డి బాబూరావు, దొమ్మంగి శ్రీనివాసరావు, ఎంపీటీసీ బండి గౌరమ్మ, ఉప సర్పంచ్ గలేరి గంగరాజు, రిటైర్డ్ టీచర్ లెక్కల సత్యనారాయణ, ట్రస్టు వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, సభ్యులు రావాడ రవికుమార్, సూరెడ్డి సుజాత, కర్రి శ్రావణి, ఏఎన్ఎం ఎం. లక్ష్మీదేవి, హెల్త్ అసిస్టెంట్ సిహెచ్. కృష్ణ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం

మాడుగుల రూరల్: జాలంపల్లి పంచాయతీ శివారు పిట్టగెడ్డ భీమలింగేశ్వర స్వామి మహా మండలాభిషేకం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం ఆలయంలో ఆదిత్యాది నవగ్రహాలకు మహా మండలాభిషేకం నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ దాత బుద్దా రామవరప్రసాదు, నాగరాజేశ్వరి దంపతులు సహకారంతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. సోమవారం స్వామివారి కల్యాణోత్సవాలతో కార్యక్రమ ముగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

మండల స్థాయి ప్రజావేదిక నేడు

దేవరాపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీపై మండల స్థాయి ప్రజావేదికను సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి తెలిపారు. 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన అన్ని ఉపాధి హామీ పనులపై మండలంలోని 27 పంచాయతీల్లో గ్రామ స్థాయి సామాజిక తనిఖీలను నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలోనే మండల స్థాయి ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నాతవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు మండల స్థాయి అధికారులంతా విధిగా హాజరు కావాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలను పరిష్కారం చేసిన విషయాలు సభలో సభ్యులకు వివరించేందుకు అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలన్నారు,

రేపు రోలుగుంటలో..

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.

ఇంటింటా ఆదరణ


దేవరాపల్లిలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం

- ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు
- మూడో రోజు కొనసాగిన కార్యక్రమం


రావికమతం: తోటకూరపాలెంలో ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న ఎంపీపీ పైల రాజు


మాడుగుల: సత్యవరంలో పథకాల గురించి వివరిస్తున్న ఎంపీటీసీ అప్పారావు


నాతవరం: చమ్మచింతలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి


మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్ చిటికెల రమణ

నర్సీపట్నం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మూడో రోజూ ఆదివారం ఉత్సాహంగా సాగింది. వార్డు, గ్రామ కన్వీనర్లు, గృహసారథులతో కలసి ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్నారు. రాజకీయ పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ 12వ వార్డు పెదబొడ్డేపల్లిలో వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, 4, 5, 6వ వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, వార్డు ఇన్‌చార్జులు దాడి బుజ్జి, యాదరిగి శేషు ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా నమ్మకం అనే స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు.

దేవరాపల్లి: జనం విశ్వాసం పొందిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రతి ఇంటా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడమే ఇందుకు నిదర్శనమని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఆదివారం విస్తృతంగా చేపట్టారు. దేవరాపల్లిలో ఎంపీపీ, జెడ్పీటీసీలతోపాటు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. మహిళా విభాగం మండలాధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి. రమణ, సచివాలయ కన్వీనర్లు గొర్రుపోటు రమాదేవి, గుల్లేపల్లి మురళీకృష్ణ, ఆతవ మహేష్, గృహ సారథులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం, పాత మల్లంపేట, గొలుగొండ తదితర పంచాయతీల్లో గృహసారథులు, నాయకులు, వలంటీర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. బుడ్డడపాడు గిరిజన గ్రామంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయం కన్వీనర్లు సంఘం పాణీకాంతారామ్, ఏఎల్‌పురంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపీటీసీ బుల్లిప్రసాద్ ఈ కార్యక్రమం నిర్వహించారు.

రావికమతం: మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. తోటకూరపాలెంలో ఎంపీపీ పైల రాజు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించడమే కాకుండా ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. గుడ్డిప, గుమ్మాళ్లపాడు, దొండపూడి, కె.బి.పి. అగ్రహారం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మాడుగుల: ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మండల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో మాడుగులలో ఇంటింటికీ తిరిగారు. సత్యవరంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇందుకూరి నాగరాజు, సచివాలయ కన్వీనర్లు తలారి కొండతల్లి, కాళ్ల రాజబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు జనపరెడ్డి అప్పారావు, శనివాడ వెంకటరమణ, గోకేడ ఈశ్వరరావు, జాజుల ఈశ్వరరావు, బరామ్ భూపతి దేవ్, చల్లా వరహాలునాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి వివరించి స్టిక్కర్లు అతికించారు.

నాతవరం: స్థానిక ఇందిరమ్మ మోడల్ కాలనీలో ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, చమ్మచింతలో వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి మానమ్మకం నువ్వే జగన్ కరపత్రాలను పంపిణీ చేశారు. చమ్మచింత సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, నాతవరం పీఏసీఎస్ డైరెక్టరు సత్యనారాయణ, నాతవరం గ్రామ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రజలంతా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎం చేయాలని సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు కోరారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని తామరం, కొండలఅగ్రహారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు.

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు జామి చిన్న ఆధ్వర్యంలో కింతలిలో గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. మాజీ సర్పంచ్ మైచర్ల సత్యంనాయుడు, సన్యాసిరావు, ఈశ్వరరావు, మెహన్‌వెంకరమణ పాల్గొన్నారు. వి.వి.అగ్రహారంలో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నారాయణరావు, సచివాలయ కన్వీనర్ బోగాది జోగారావు, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, రాజుతాత జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. తాటిపర్తిలో సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ సంజీవ్ సారథ్యంలో, ఒమ్మలిలో పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డాపు భాస్కరరావు, జాలంపల్లిలో సర్పంచ్ దారమల్లేశ్వరి సారథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

కె.కోటపాడు: ఎన్నికల హామీల్లో సీఎం జగన్ 98 శాతం అమలు చేశారని ఉప సర్పంచ్, సచివాలయ కన్వీనర్ రెడ్డి అరుణ అన్నారు. కె.కోటపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ పాలనలో హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన విధానాన్ని వివరించారు. ఎంపీటీసీ బంగారి లక్ష్మి, ఆర్బీకే చైర్మన్ డోకల అప్పలనాయుడు, భూపతి కోటి పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.నాయడుపాలెం సర్పంచ్ గుములూరి బాబులు, జె.నాయుడుపాలెంలో సర్పంచ్ బగుడు వెంకటరమణ, జానకీరాంపురంలో సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు, జె.పి.అగ్రహారంలో చిటికెల వెంకటసత్తిబాబు ఇంటింటా తిరిగారు. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు, లబ్ధిదారుల ఎంపికలో వ్యత్యాసాలను వివరించారు.


మాడుగుల రూరల్: కింతలిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న జామి చిన్న


రోలుగుంట: కె.నాయుడుపాలెంలో ప్రజలకు తెలియజేస్తున్న సర్పంచ్ బాబులు


గొలుగొండ: బుడ్డడపాడు గిరిజన గ్రామంలో ప్రచారం


నర్సీపట్నం: సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కౌన్సిలర్ సుబ్బలక్ష్మి


కె.కోటపాడులో ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న అరుణ, తదితరులు

కలెక్టరు మాట.. గిరిజనులకు బాట


అసనగిరి గ్రామానికి కాలినడకన వెళ్తున్న కలెక్టరు రవి పటాన్‌శెట్టి (పాతచిత్రం)

- రూ.10 లక్షలతో సుందరకోట, అనసగిరి గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం
- బ్రిటిష్ కాలం నాటి రోడ్డుకు మోక్షం

నాతవరం: బ్రిటిష్ హయాం నుంచి గిరిజనులను వెంటాడుతున్న రహదారి కష్టాలకు ఎట్టకేలకు చెక్ పడింది. మండలంలోని గిరిజన ప్రాంతమైన సుందరకోట, అసనగిరి గ్రామాల మధ్య రోడ్డు నిర్మిస్తానని కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి ఇచ్చిన మాట నేడు కార్యరూపం దాల్చింది. గతేడాది ఆయన మండల పర్యటనలో భాగంగా సరుగుడు పంచాయతీని సందర్శించారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుందరకోట పంచాయతీ శివారు గ్రామం అసనగిరికి నేటికీ రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆ గ్రామానికి గిరిజనులతో కలిసి సుమారుగా నాలుగు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లారు. అక్కడ పరిస్థితులను పరిశీలించారు. గ్రామానికి ప్రధానంగా రోడ్డు ఏర్పాటు చేస్తే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని గుర్తించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పలుమార్లు గిరిజనుల సమస్యలపై కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రూ.10 లక్షలు మంజూరు చేసి పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో సుందరకోట, అసనగిరి మధ్య కొండల్లోంచి మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు.


సుందరకోట, అసనగిరి మధ్య రోడ్డుకు కొలతలు సేకరిస్తున్న పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ

కొండ గ్రామాల గిరిజనుల ఆనందం

బ్రిటిష్ హయాం నుంచి రోడ్డు లేక కాలినడకన వెళ్లే గిరిజనులు ప్రస్తుతం వాహనాలపై అసనగిరి గ్రామానికి వెళ్తున్నారు. కొండల మీదనున్న గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ. 5 కోట్లుతో ప్రతిపాదనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం, కమ్యూనిటీ భవనం, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తానని కలెక్టరు అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ పనులు చేయాలంటే గ్రామానికి రోడ్డు వేయాలని నిర్ణయించి చర్యలు చేపట్టారు. త్వరలో రూ.20 లక్షలతో మెటల్ రోడ్డు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేయడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరు సందర్శన తర్వాత అర్హులందరికీ పింఛన్లు, అమ్మఒడి, రైతు భరోసా, తదితర సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ఉపాధి హామీ పనులు కల్పించారు.

కలెక్టరు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు



నేను ప్రాతినిధ్యం వహిస్తున్న సుందరకోట, అసనగిరి గ్రామాల మధ్య రోడ్డు నిర్మించిన కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌లకు గిరిజనులు తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. బ్రిటీష్ కాలం నాటి రోడ్డు సమస్యకు నా హయాంలో పరిష్కారం కావడం సంతోషంగా ఉంది

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం మండలం

అభివృద్ధికి ఆస్కారం



రోడ్డు వేయడంతో గిరిజన ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుంది. గతంలో రోడ్డు లేక ఆ గ్రామానికి వెళ్లడమే కష్టంగా ఉండేది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ తయారు చేశాం.

– లోకుల యాదగిరీశ్వరరావు, ఎంపీడీవో, నాతవరం

లక్కవరంలో పారిశుధ్య పనులు


మురుగుకాల్వను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది


మంచినీటి బోర్‌వెల్ వద్ద చెత్తను ఎత్తుతున్న సిబ్బంది

చోడవరం రూరల్: లక్కవరం గ్రామ పంచాయతీలో మురుగు కాలువలను మెరుగు పరిచే కార్యక్రమాన్ని చేపట్టి ఏకబిగిన నిర్వహిస్తున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీని పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యలను సర్పంచ్ శీరంరెడ్డి దేముడమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు, వార్డు మెంబర్ శీరంరెడ్డి వెంకటరమణ చేపట్టారు. ఇక్కడ మెయిన్‌రోడ్డు, వెలమవీధి, కాపులవీధి, రాజులవీధి, ఎస్సీ, బీసీ, రజక కాలనీలలోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన పూడికను సంపూర్తిగా తీసివేసే పనులను గత పక్షం రోజులుగా ఏకబిగిన చేయిస్తున్నారు. వర్షాలు ఆరంభమైతే మురుగు కాలువలను మెరుగు పరచడం సమస్యాత్మకం కావడమే గాకుండా, చెమ్మగా ఉండే వాతావరణంలో మురుగును తీయడం వల్ల అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. దాంతో వేసవిలోనే మురుగు కాలువలను మెరుగు పరచాలని నిర్ణయించి పంచాయతీలోని అన్ని ప్రాంతాల్లో మెరుగు పరుస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. వీటితోపాటు అన్ని మంచినీటి గొట్టపు బావుల వద్ద ఎటువంటి చెత్త లేకుండా, మురుగు నిల్వ చేరకుండా శుభ్రం చేస్తున్నామన్నారు. కొన్ని కూడళ్లలో పేరుకుపోయిన చెత్త కుప్పలను ఎత్తివేయించి డెబ్రిస్ డంప్‌లకు తరలించామన్నారు. దీనికి పంచాయతీ సిబ్బంది, ముఖ్యంగా పారిశుధ్య సిబ్బంది చక్కని తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు.

తెలికుల సంఘం మండలాధ్యక్షుడిగా గండేపల్లి


నూతన అధ్యక్షుడు సత్తిబాబును అభినందిస్తున్న సంఘ సభ్యులు

దేవరాపల్లి: ఉమామహేశ్వరీ అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా దేవరాపల్లికి చెందిన గండేపల్లి సత్తిబాబును సంఘ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరాపల్లిలో సంఘం నూతన కమిటీని ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎల్లేటి కరుణాకర్‌నాయుడు, కన్వీనర్ ఎం. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా ఇంజరపు శ్రీను, కోశాధికారిగా కొమ్మనాపల్లి స్వామినాయుడులను ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గ సభ్యులను సంఘం సభ్యులంతా అభినందించి సత్కరించారు. అనంతరం సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలకు తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొమ్మనాపల్లి ప్రసాద్, ఐ. రాము మాస్టారు, గండుపల్లి శ్రీను పాల్గొన్నారు.

విశ్రాంత చీఫ్ మేనేజర్ సేవలు చిరస్మరణీయం


చీఫ్ మేనేజర్‌కు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం

చోడవరం రూరల్: ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత చీఫ్ మేనేజర్ ఇచ్ఛాపురపు లక్ష్మీ నరసింహం బ్రాహ్మణ సంఘానికి, బ్రాహ్మణుల అభివృద్ధికి చేసిన సేవలు మరువలేమని చోడవరం గణేష్ గాయత్రి సంఘం సభ్యులు తెలిపారు. స్థానిక సంఘం భవనంలో ఆదివారం దివంగత చీఫ్ మేనేజర్ సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. సంఘం బాధ్యులు కందర్ప రమేష్, మంథా గౌరీశంకర్, గుంటూరు సత్యనారాయణ, ఎంపీటీసీ పుత్రేవు శ్యామ్, ఎం.వీరన్నపంతులు, కందర్ప కృష్ణమూర్తి మాట్లాడుతూ ఐఎల్ఎన్‌గా పేరున్న ఆయన బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి, బ్రాహ్మణ కైలాస వాటిక నిర్మాణాలకు విశేష కృషి చేశారని కొనియాడారు.

డానియల్ పాస్టర్‌కు ఆర్డినేషన్ పట్టా


పట్టా అందుకుంటున్న డానియల్ పాస్టర్

నర్సీపట్నం: డానియల్ పాస్టర్‌కు బిషప్ ఆర్డినేషన్ గౌరవ పట్టా వరించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో చెన్నైకు చెందిన హెచ్.ఎస్.సి యూనివర్సిటీ వారు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నర్సీపట్నం యోరూసలేం ప్రార్థనా మందిరం సంఘ కాపరి డానియల్ పాస్టర్‌కు బిషప్ ఆర్డినేషన్ పట్టాను యూనివర్సిటీ ప్రతినిధులు అందజేశారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు


పెదగోగాడలో బోరు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

చీడికాడ: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రెండు గ్రామాల్లో తాగునీటి బోర్లు తవ్వకాన్ని ప్రారంభించారు. ఆదివారం పెదగోగాడలో కనక మహాలక్ష్మి ఆలయం వద్ద, తంగుడుబిల్లి దుర్గాలమ్మ గుడి వద్ద వీటి ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఆయా గ్రామస్తులు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


మాట్లాడుతున్న జీవన్‌రాయ్

మాకవరపాలెం: ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొండలఅగ్రహారం చర్చిలో ఇమ్మానుయేలు సంస్థ డైరెక్టర్ జీవన్‌రాయ్ మాట్లాడుతూ ఈస్టర్ ప్రత్యేకతను తెలియజేశారు. మాకవరపాలెంలో పెంతుకొస్తు ప్రార్థనా మందిరం, క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో రెవరెండ్ టి.వి.రత్నం, పాస్టర్లు విక్టర్‌పాల్, వి.పాల్, కిరణబాబు ఈస్టర్ విశిష్టతను వివరించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం పార్థనా మందిరంలో పాస్టర్ జోసఫ్ దేవా ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బుడబండి రాజు పాల్గొన్నారు. ముకుందపురం, గాదిరాయి, కింతలి, కాశీపురం, తాటిపర్తి, ఎల్.పోన్నవోలు గ్రామాల్లోని చర్చిల్లో పార్థనలు చేశారు.

హనుమాన్ శోభా యాత్రకు పయనం

పాయకరావుపేట : అనకాపల్లిలో జరిగే శ్రీ హనుమాన్ శోభాయాత్రకు పట్టణం నుండి పలువురు హనుమాన్ భక్తులు బయలుదేరి వెళ్ళారు. ఆదివారం అనకాపల్లిలో గల శ్రీ సూర్యానారాయణ మందిరం వద్ద జరుగుతున్న హనుమాన్ శోభా యాత్రలో పాల్గొనడానికి హనుమాన్ భక్తులు మోటారు బైక్ లపై బయలుదేరారు. వికాస తరంగిణి ప్రతినిధి చిక్కాల శ్రీనుతో పాటు పలువురు శోభాయాత్రకు తరలివెళ్లారు.

ఘనంగా పండగలు

మాడుగుల రూరల్: గ్రామ దేవతలు పండగలు ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కె.జె.పురం, సాగరం, సురవరం, ఘాట్‌రోడ్డు గ్రామాల్లోని మోదకొండమ్మ ఆలయాల్లో భక్తులు ఒడ్డు పండగలు నిర్వహించారు. అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు.